ఈ వారం కథ

# రంగుల కల

కె.వి.నరేందర్

''వాళ్ళు తనని చూసి వెళ్ళి మూడ్రోజులు దాటింది....

వెళ్ళగానే ఉత్తరం రాస్తామన్నారు కదా... బహుశా ఈరోజు ఉత్తరం వస్తుందేమో?'' ఎంత వద్దనుకున్నా సులోచన మనసులో ఇవే ఆలోచనలు హోరెత్తుతున్నాయి. తెల్లవారు ఝామున ఐదు గంటలకి మెలకువ వచ్చిన వెంటనే... చుట్టు ముట్టిన ఆలోచనలు...

సీల్డ్ టెండరు కవర్‌లా వచ్చే అలాంటి ఉత్తరాల కోసం ఎదురుచూసి... తీరా వచ్చాక తండ్రి విప్పుతుంటే గుండెలు దడదడలాడి... అందులోని పదాలు తలుపు చాటుగా వింటే...

''అన్నీ నచ్చాయి... కాని... అమ్మాయికి రంగు తక్కువని వద్దనుకుంటున్నాము. అందుకు సరిపడా మరో రెండులక్షలు ఎక్కువ సర్దితే సంబంధం ఖాయం చేసుకుందాం...'' అనే సారంశం విని... అద్దం ముందుకు పరుగెత్తి... తన శరీరాన్ని ఆవరించిన నల్లరంగుని బాధగా... దుఃఖంగా... అవమానంగా... అసహ్యంగా... చూసుకుంటూ రోధించిన రోజులెన్నో...

ఆడదాని పెళ్ళికి రంగు అనేది ఎంత అడ్డంకిగా తయారవుతుందో అనుభవించిన వాళ్ళకే తెలుసు...

భగుంతుడు మనిషికి రెండు రంగుల్ని ఎందుకు పులిమాడు? రక్తమాంసాల ఈ అస్థిపంజరానికి లక్షల రోగాలిచ్చింది చాలక... మళ్ళీ ఈ రంగులెందుకు?

శరీరం నల్లగా వుంటే ఏవగింపు....?

వెంట్రుకలు తెల్లబడితే ఏవగింపు???

ఎందుకీ రంగుల తారతమ్యం? ఎర్రతోలు ఏడువంకల్ని కప్పిపెడితే... నల్లరంగు నాలుగురకాల అందాల్ని తొక్కిపెడుతుందేమో? నిజానికి తనలోని అవయవాలన్నీ సక్రమంగా, పొందిగ్గా వున్నాయి. కాలేజీరోజుల్లో 'బ్లాక్ బ్యూటీ' అని కొంటెగా ఎవరైనా పిలిచినప్పుడు... మనసులో ఎంత పొంగిపోయేది?

రోజూ వచ్చే చీకటిది నలుపురంగైనా ప్రేమించట్లేదా?

ఆ 'నలుపు'లోనే కదా... అసలు పునఃసృష్టి జరుగుతోంది. మరి నలుపంటే వీళ్ళకెందుకింత అసహ్యం?

''సులోచనా... పదకొండయింది... స్నానం చేయవే. బహుశా ఈ రోజు కరీంనగర్ వాళ్ళనుంచి లెటరొస్తుందేమో...'' తల్లి మనసుని కూడా తొలిచేస్తున్న భావం మాటల్లో బయటికి రానే వచ్చింది.

''వెళ్తున్నానమ్మా... అయినా వాళ్ళుకూడా రంగు తక్కువనే రాస్తారేమో....?'' గొణుక్కున్నట్టుగా అంది.

''అబ్బాయి కూడా నలుపుగానే వున్నాడు కదే. తప్పకుండా ఒప్పుకుంటాడని నా కనిపిస్తోంది'' అంది బట్టలారవేస్తూ...

''ఇద్దరం నల్లగా అవుతే... పుట్టబోయే పిల్లలుకూడా కాకిపిల్లల్లా వుంటారు. అందుకే నాకైతే ఈ సంబంధం అంతగా ఇష్టం లేదు...'' కాస్త కోపంగా అంది సులోచన.

''ఎర్రటి మొగుడొచ్చినంత మాత్రాన పిల్లలకి తండ్రి రంగే వస్తుందన్న గ్యారంటీ ఏమిటే పిచ్చిదానా?'' నువ్వుతూ అంది తల్లి.

''అసలు నీకు బుద్దెలేదమ్మా... నువ్వేమో ఎర్రగా బుర్రగా బాగానే వున్నావు. నాన్నేమో నల్లగా వున్నాడు. నాన్న రంగే నాకొచ్చింది. అదే తమ్ముడికి మాత్రం నీ రంగొచ్చింది. నీ పెళ్ళప్పుడే ఎర్రగా ఉన్నాయన్ని చేసుకోవల్సింది'' అంది ఉక్రోషంగా.

''మా కాలంలో పెళ్ళికొడుకు ఎలా వున్నాడు? ఏ రంగులో వున్నాడు అని చూశారా? నేను ఎర్రగా వున్నాననే మా నాన్న ఆ కాలంలో ఐదువేల కట్నానికి చేసుకున్నాడు. తమ్ముడి కలరు నీకొచ్చిన... ఇప్పటికి ఇద్దరు బిడ్డల తల్లయ్యేదానివి. మన ఖర్మ ఏం చేద్దాంగాని... స్నానంచేసి రా... అన్నం తిందాం...'' అంది అనునయంగా.

సులోచన గుండె బరువైంది.



బాత్రూంలో తన శరీరాన్ని చూసుకోవాలన్న ఆసక్తే పోయింది. వయస్సు పెరిగిన కొద్దీ నలుపు ఎక్కువవుతోందే తప్ప తగ్గలేదు... ఈ నలుపు గురించి ఎన్ని రోజులు ఆలోచించింది? ఎన్ని క్రీములు వాడింది? చివరికి ఉండబట్టలేక స్కిన్ స్పెషలిస్టుని కలిసి అసలు రంగు ఇలా రావడానికి కారణమేంటని కూడా అడిగింది.

డాక్టర్ చెప్పాడు ''మనిషి చర్మంలో మిలినోసైట్స్ అనేవి ఎక్కువగా వుంటే... ఎరుపు రంగొస్తుంది... తక్కువగా వుంటే నలుపురంగొస్తుంది'' అని- అప్పట్నించీ 'భగవంతుడా... నాకు మిలినోసైట్స్ ఎందుకు తక్కువగా ఇచ్చావ్?'' అని మొర పెట్టుకునేది.

ఎరుపుగా తెల్లగా ఉన్నవాళ్ళని చూడగానే మనసు మూగవోయేది? ఒక్కోసారి జెలసీ పుట్టేది.

తన మర్చిపోయినా ... తన రంగుని ఎందరు గుర్తు చేసేవాళ్ళు??? బట్టల షాపులోకెళ్లి చీరెల చూస్తుంటే... ''మీది నలుపురంగు కదమ్మా... ఈ శారీ బాపుంటుంది...'' అనే షాపువాడు.

లేడీస్ ఎంపోరియంలో కెళితే ''మీలా రంగు తక్కువుగా ఉన్న వాళ్ళకి లక్మే పౌడర్‌తో ఈ రకం బెటర్‌గా ఉంటుందండీ'' అనే సేల్స్ గర్ల్.

కాలేజీ లంచ్ అవర్‌లో మొహం కడుక్కుంటే... ''ఎలుక తోలుపట్టి ఏడాది ఉతికినా...'' అని నవ్వుతూ పాడే ప్రణీత.

''నీ కాలికి వెండి పట్టగొలుసులు కొట్టొచ్చినట్టు కన్పడుతున్నాయమ్మా'' అనే పక్కింటి రాధికమ్మ.

''జోరు మీదున్నావు తుమ్మెదా... ఆ జోరెవరికోసమే తుమ్మెదా...'' అని వెటకారంగా పాడే సుందరంగాడు.

ఇలా ఎందరెందరు...

ఒక్కోసారి శరీరాన్ని బ్లేడ్‌లతో కోసేసుకోవాలన్నంత దుఃఖం కలిగే మాటలు ఒక్క రంగువల్ల భరించింది.

ఇప్పుడు పెళ్ళికొచ్చేసరికి... ఇది తీవ్రమైన సమస్య అయింది.

ఈ నలుపు రంగుకి బదులు... ఆ దేవుడి నీలం రంగు వచ్చినా బావుండేదేమో? ఈ ఆలోచనల మధ్య స్నానం పూర్తి చేసి వచ్చింది.

అప్పుడు గుమ్మంలో 'పోస్టు' అన్న కేక విన్పించటంతో ఉలిక్కిపడింది. తల్లికూడా ఆ కేక విని వంటింట్లోంచి వచ్చింది. పోస్టుమాన్ కవర్ చేతిలో పెట్టి వెళ్లాడు.

''నాన్నగారు లేరు కదమ్మా... విప్పాలా? వద్దా?'' అనడిగింది. తల్లికూడా కాసేపు సందిగ్ధపడి... ''నాన్న గారేమంటారు? ఏం కాదు. విప్పిచదువు'' అంది.

ఆ కవర్ చించుతుంటే... భయం ఆతృత... బాధ... టెన్షన్... భగవంతుడా ఏం న్యూస్ వుందో... ఒప్పుకున్నారా...

మనసునిండా అలజడి తుఫానై రేగుతుంటే... కాగితం విప్పింది. ఆ వెంటనే ఆమె కళ్ళు 'రంగు' అనే పదం కోసం మెరుపులా జివ్వున శోధించాయి.

ఎక్కడా కన్పించలేదు.

''ఏం చూస్తావే... చదువరాదూ'' తల్లి అడగడంతో ఈ లోకంలోకొచ్చి పడింది. ఉత్తరాన్ని జాగ్రత్తగా చదివింది.

పేజీ తిప్పాక ఆ వాక్యం కనబడింది.

''మా అబ్బాయి నేనూ తక్కువే వున్నాను. కట్నం లేకపోయినా నాకు ఎరుపురంగు అమ్మాయే కావాలి అని గొడవ

పెడుతున్నాడు. మీ అమ్మాయికూడా రంగు తక్కువని ఈ సంబంధం వద్దనుకుంటున్నాం...'' అసలు విషయాన్ని నిర్మొహమాటంగా, నిష్కర్షగా రాసారు.

మొదట్నించీ ఊహించిందే కాబట్టి... అది చదవగానే సులోచన మునపటిలా ఫీలవలేదు... కానీ ఆ అబ్బాయికూడా తనలాగే రంగు సమస్యని ఎదుర్కొంటున్నాడని గ్రహించింది.

తల్లి నిశ్శబ్దంగా లేచి వెళ్లటంతో... ఉత్తరాన్ని తండ్రి వాలు కుర్చీలో పడేసింది సులోచన.

అలాంటి ఉత్తరాలు వచ్చిన ప్రతిసారీ ఇంట్లోంచి శవం తరలిపోయినంత నిశ్శబ్దత... ఆ మౌనం కూడా నలుపురంగు పులుపుకున్నట్టు... గంభీరమై శాసిస్తుంది...

★ ★ ★

''మరో సంబంధం వస్తోంది... అబ్బాయి మొన్న గుళ్ళో అమ్మాయిని చూసాడట... తనకి నచ్చిందని వాళ్ల అమ్మా నాన్నలతో చూడ్డానికి వస్తున్నారు'' అన్నాడు తండ్రి.

ఆ మాట విని సులోచన నివ్వెరపోయింది.

ఎన్నెళ్ల తరువాత ఒక మంచిమాట... తను నిజంగా నచ్చిందా? నల్లగా వున్న తను నచ్చడమేంటి? ఒకవేళ కట్నం ఎక్కువిస్తారని ఆశేమో? అంతే అయివుంటుంది. ఇలాంటి కేసులు ఎన్ని వచ్చిపోలేదు... అనుకుంది నిర్లిప్తంగా.

తల్లితోకూడా అదేమాట అంది.

''ఏమోనే... నచ్చిందనే చూడ్డానికొస్తున్నారు. వచ్చాక గాని తెలీదు. వరకట్నం ఎంత అడిగేదీ?'' అంది భయపడుతూనే.

అప్రమత్తంగా ఆమె చూపులు దేవుళ్ల పటాల మీదికి మాటి మాటికీ వెళ్తున్నాయి. అనుకోకుండా... వాళ్ల మనసులోని మాటని పసిగట్టినట్టు వచ్చి తండ్రి అన్నాడు.

''అమ్మాయి నచ్చిందన్నారు కాని... కట్నం ఎక్కువ డుగుతారేమో? అబ్బాయి కూడా చాలా తెల్లగా, అందంగా ఉన్నాడట. మంచి ఉద్యోగం. ఏది ఏమైనా అమ్మాయికి రంగు తక్కువని కొంత ఎక్కువ కట్నం అడిగినా అప్పో సప్పోచేసి పెళ్లి చేసేస్తాను... అవసరమైతే ఇంటినికూడా అమ్మేస్తాను...'' అన్నాడు గంభీరంగా.

సులోచన కళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

చర్మం ఏ రంగుదైనా స్పర్శ ఒక్కటే... అన్నట్టు పాదాల దగ్గర అప్పుడే చీమ కుట్టింది.

ఆ చీమని కొనగోటితో తప్పించింది కాని... దాన్ని చంపాలనిపించలేదు. ఆ సాయంత్రం... పెళ్లి చూపులకు వాళ్లొచ్చారు... సులోచన నిండుగా తయారై కూచుంది. తలొంచినా... కనురెప్పలు పైకెత్తి అబ్బాయిని చూసింది.

నిజంగా ఎంత అందగాడు?

ముఖ్యంగా ఎంత తెల్లగా వున్నాడు?

అతడి పక్కన తను... కాకి ముక్కున దొండపండులా... ఛ... ఈ సామెతల్ని ఎవడు కనిపెట్టాడోగాని... ప్రతి దానికి గుర్తొచ్చి కత్తిలా కోస్తాయి.

అతడి తల్లి చెప్తోంది.

''మా అబ్బాయికి మీ అమ్మాయి చాలా నచ్చింది. వాడికే కదా. మాక్కూడా కట్న కానుకల ఆసక్తి లేదు. మా వాడు మీ అమ్మాయికి నచ్చితే ముహూర్తాలు పెట్టిద్దాం'' అంది. ఆ మాట విని వాళ్లకి కొంతసేపు ఏమీ అర్థం కాలేదు. తేరుకోడానికి ఐదు నిమిషాలు పట్టింది.

ఆ తర్వాత ఆనందం, ఆశ్చర్యం కలగలిపి పంచాంగం పుటలు తెరిపించారు. పదిహేనురోజుల్లో పెళ్లి ముహూర్తం పెట్టారు.

సులోచన సీతాకోకచిలుకే అయింది. కళ్ళెత్తినా... కళ్యాణమొచ్చినా మాటమాటికీ గుర్తొస్తుంటే ఛ... వెధవ సామెత ఇలా వెంటాడుతోంది అనుకుంది ఆనందంగానే.

మర్నాడు చుట్టుపక్కల ఛానెల్స్ అన్నీ తెరుచుకున్నాయి.

వాళ్ల లైవ్ కాస్ట్‌కి... ఇంటిల్లిపాది బెదిరిపోయారు.

'బొగ్గులా ఉన్న అమ్మాయిని కానీ కట్నం లేకుండా ఎందుకు చేసుకుంటారు? ఏదైనా మాయదారి రోగం ఉందేమో?''

''లేదా ఇదివరకే పెళ్లయి ఏమైనా అయిందేమో?''

''అందం, ఆస్తి, ఉద్యోగం ఉన్న కుర్రాడు రంగులేదని ఇరవై సంబంధాలు తప్పిన అమ్మాయిని ఊరికే చేసుకోవడమేంటి? ఇందులో ఏదో తిరకాసుంది''

''అదంతా పెళ్లయ్యాక బటయపడితే... అమ్మాయి బతుకు ఘోరం'' అన్నీ విన్నాక సులోచనకి కూడా నిజమే అన్పించింది. అతడు తనను ఒప్పుకోవటం వెనుక మరేదైనా అంతర్యం వుందా?

మనసులోంచి భయం వెళ్లిపోయింది.

అతడిపట్ల ఏదో భావన... అనుమానం... అప్పటికే పెళ్లి ముహూర్తం దగ్గర పడింది. మెళ్లో అతడు మూడు ముళ్ళు వేస్తుంటే గజగజా వణికిపోయింది. గుండె దిక్కు బట్టుకుని శోభనం గదిలోకి వెళ్లాక సులోచన అడిగిన మొదటి ప్రశ్న.

''ఇంత తెల్లగా వున్న మీరు.. ఇంత నల్లగా వున్న నన్ను కట్నం లేకుండా ఎందుకు చేసుకున్నారు? నిజం చెప్పండి''

అతడు నవ్వాడు.

''పిచ్చి సులోచనా... నువ్వెంత అందంగా వున్నావో నువ్వే గుర్తించలేదు. ఎర్రికైనా అగుపించిన వెంటనే నీలోని నలుపురంగు కనపడేసరికి... నీలోని అందాన్ని చూడలేక పోయారు. కాని నీ కళ్లల్లో ఎంత కాంతివుందో తెల్సా? నీ పెదాల్లో ఎప్పుడూ ఆరని తడివుంది. నీ ముక్కుపుడక మీద నాకెంత జెలసీ పుట్టిందో... తెలుపు, నలుపు కాని రంగులో నీ నడుంలోని ఎంత అందాన్ని నేనే పసిగట్టాను. అందుకే నువ్వంటే ఇష్టపడ్డాను...'' అన్నాడు నవ్వి దగ్గరకు తీసుకుంటూ.

సులోచనకి పెద్ద బరువు దిగినట్లయింది. లోకంలో ఇంత మంచి మనుషులుకూడా ఉంటారా అనుకుంది. ఆ రాత్రి తనని తాను అర్పించుకుంది.

★ ★ ★

నాలుగు నెలల తర్వాత...

కడుపులో బిడ్డ రూపానికొస్తుందని డాక్టర్ చెప్పాక.... అంతా ఆనందపడితే సులోచన ఆందోళన పడింది.

కడుపుమీద భయంగా చెయ్యేసుకుని భర్తతో ''ఎవండీ... పుట్టబోయే బిడ్డకి కొంపదీసి నా రంగొస్తే...'' అంది బేలగా.

''నీ రంగే రావాలని కోరుకుంటున్నాను'' అన్నాడు నవ్వుతూ భర్త.

''అదేం కాదు... మీ రంగే రావాలి. ఈరోజునుంచి నేను కొబ్బరి బొండాలు, చెర్రిపండ్లు, క్యారెట్ ముక్కలు బాగా తినాలి. ఎర్రటి బాబుని కనాలి'' అంది ఆశగా.

''అవేం వద్దు నీలాంటి అమ్మాయే కావాలి నాకు...'' అని భర్త పాడటంతో అతడిలోని అనురాగానికి ఆమె మురిసిపోయింది.

★




